
# గతించని గతం



ఎమ్బీయస్ ప్రసాద్

రిటైర్డ్ పోలీసు సూపర్నెంటు రవితేజ ఉలిక్కిపడ్డాడు గీతాంజలిని చూడగానే. ఎక్కడో బెంగుళూరులో చూసిన గీతాంజలి, నాలుగేళ్ల తర్వాత, ఇక్కడ ఈ చిన్న ఊర్లో కనబడడమా? పొరబాటు పడలేదు కదా! అనుకుని కళ్లు నులుముకుని మరీ చూసాడు.

సందేహం లేదు. గీతాంజలే! ఆమె రూపంలో..., అందంలో ఆవగింజంతైనా మార్పు రాలేదు. ఆనాడు ఫణీంద్ర మరణించిన రోజున తొలిసారి ఆమెను చూసినప్పుడు ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. ఎటొచ్చీ ఆ రోజు భర్త పోయిన దుఃఖంలో మునిగి ఉంది. ఈనాడు కొత్త భర్త కాబోలు, అతనితో, చెట్టాపట్టాలు వేసుకుని హాయిగా విహరిస్తోంది.

అవి రవితేజ బెంగుళూరులో పనిచేసే రోజులు. ఫణీంద్ర అనే బిజినెస్‌మన్ చనిపోయాడని తెలిసి ఇన్వెస్టిగేషన్‌కి వెళ్లినప్పుడు కనబడింది అతని భార్య గీతాంజలి. ఫణీంద్ర స్లీపింగ్‌పిల్స్ తిని ఆత్మహత్య చేసుకున్నాడని డాక్టరు అన్నాడు. "హత్యకూడా కావచ్చు. స్లీపింగ్‌పిల్స్ తినాల్సినంత ఖర్మ ఫణీంద్రకు పట్టలేదు. బోల్డు డబ్బుంది. పిల్లా, పాపా లేరు కాబట్టి ఆ డబ్బంతా భార్యకు పోతుంది. డబ్బుకోసం ఆమెయే ఏ పాలలోనో కలిపి మొగుడికి ఇచ్చి ఉండవచ్చు. జాగ్రత్తగా చూడండి సార్!" అన్నాడు ఏ ఎస్పీ.

గీతాంజలి మొహం చూస్తే అలా అనిపించలేదు రవితేజకు. ఎందుకైనా మంచిదని మర్డర్ ఏంగిల్ కూడా వదిలిపెట్టలేదు. ఆమె మీద కేసు నమోదు చేయించాడు. ఆధారాలన్నీ జాగ్రత్తగా పరిశీలించాడు. అతని కాగితాలు వెతుకుతూంటే దొరికింది

ఫణీంద్ర ఆత్మహత్య ఉత్తరం. ద్యాన్ని బట్టి అది హత్య కాదని ఆత్మహత్యేనని తెలిసింది కానీ దాని వల్ల గీతాంజలి వేరే రకమైన చిక్కుల్లో పడింది.

రవితేజ ఆమెను పిలిపించి చెప్పాడు: "చూడండి, మేడమ్, ఫణీంద్ర తన ఉత్తరంలో స్పష్టంగా రాశాడు...నా చావుకు కారణం నా భార్యే అని. మీరు పెట్టే మానసిక హింసవల్లనే, మీ గయ్యాళితనంవల్లనే ప్రాణం తీసుకుంటున్నానని రాశాడు. ఏమంటారు?" అని అడిగేడు.

గీతాంజలి పెద్దపెట్టున ఏడ్చింది. "మా ఇద్దరి మధ్యా ఏవేవో చిన్న చిన్న గొడవలున్నమాట వాస్తవమే కానీ మరీ ఇంత ఇదిగానా!? ఆ మాటకొస్తే ఏ భార్యాభర్తల మధ్య పొట్లాటలు లేవు చెప్పండి. నేను గయ్యాళి అని ఆయన అంటే, ఆయన రాక్షసుడని నేనంటాను. కానీ ఆయన మాటే నమ్ముతారు. ఆయన ప్రాణం తీసుకున్నాడు కాబట్టి. నేనూ ఏ నూతిలోనో, గోతిలోనో పడితే అప్పుడు నా మాటా నమ్ముతారు. ఏం లోకంరా బాబూ ఇది!" అంటూ వాపోయింది.

రవితేజకు నిజమే ననిపించింది. ఫణీంద్ర చిన్న సమస్యను పెద్దగా ఊహించుకుని బాధపడ్డాడేమో... బాధపడి ప్రాణం తీసుకున్నాడేమో.... ఎవరికి తెలుసు? అతని ఓవర్ రియాక్షన్‌కు భార్యను శిక్షించడం అన్యాయమేమో!? ఒక విషయం మాత్రం ఖరారయింది...గీతాంజలి హంతకురాలైతే కాదు. ఎటలీస్ట్ డైరక్టుగా భర్త ప్రాణాలు తీయలేదు. సతాయించి, సతాయించి అతనికి జీవితం మీద విరక్తి కలిగించి, స్లోగా చంపడం ఒక్కటే ఆమె చేసిన తప్పు. ఆమెపై కేసు విత్‌డ్రా చేయడం గురించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంజుండప్ప నడిగి చూద్దామనుకున్నాడు రవితేజ.

నంజుండప్ప వయసుకు ముసలాడే కానీ మంచి హుషారైనవాడు. గీతాంజలి ఫొటో చూస్తూనే, "ఇలాంటి అమ్మాయి హత్య చేయగలదని అనుకోవడం పొరబాటయ్యా. మగాళ్లను చంపడానికి వాళ్ల వాలు చూపులు చాలు. తుపాకీ గుళ్లెందుకు? స్లీపింగ్ పిల్సెందుకు?" అంటూ జోకులు వేసాడు.

"ఆ మాట నిజమే గానీ, ఆ ఉత్తరం బయటపెడితేనే ఆమె నిర్దోషి అని తేలేది. దానికి ఆమె ఇష్టపడటం లేదు. తనకు గయ్యాళిగా ముద్రపడుతుందన్న భయంట. ఫణీంద్ర ఆస్తి బోల్డంత కలిసివచ్చినప్పుడు ఏ ముద్రపడితే ఏం నష్టంట? వయసు పాతికేళ్లే కాబట్టి ఒకవేళ మళ్లీ పెళ్లి చేసుకోవాలని అనుకుంటోందేమో! ఈ ఇమేజీ వల్ల ఎవడూ ముందుకు రాడన్న భయమేమో! అవును మరి, సతాయింపు ఇలా, అలా కాదు. అవతలివాడు కోరి చావు వరించేటంత!..." అని రవితేజ అంటుండగానే,

"ఆ ఉత్తరం నాకు ఇచ్చి వెళ్లండి. ఆ అమ్మాయితో మాట్లాడి చూసి ఏం చేద్దామో నిర్ణయిద్దాం. కేసు పెడదామా వద్దా, పెడితే నిలుస్తుందా లేదా అన్నీ ఆలోచించి చెప్తా"అన్నాడు.

తర్వాత కేసు విత్‌డ్రా చేయడం వరకే రవితేజకు తెలుసుకానీ, ఈ సందర్భంగా కలిసిన గీతాంజలి నంజుండప్ప ఒకరినొకరు ఇష్టపడతారనీ, భార్యాభర్తలు కాదలుచుకున్నారనీ ఊహించలేదు. ఆర్నెల్ల తర్వాత ఓ క్లబ్బులో ఆ దంపతులు కలిసినప్పుడు ఆశ్చర్యాన్ని దాచుకోలేదు. "మా ఇద్దరి మధ్యా వయసు తేడా గురించి ఆలోచించకండి. నా భార్య పోయి ఐదేళ్లయింది. పిల్లలందరూ సెటిలై వేరే ఊళ్లల్లో ఉన్నారు. ఈమె కారణంగా కొత్త జీవితం ప్రారంభమయినట్టుంది. చిన్నతనపు హుషారంతా గుర్తుకు వస్తోంది." అన్నాడు నంజుండప్ప. గీతాంజలి కేసి చూసాడు రవితేజ. ఆమె కూడా తల ఊపింది. భర్తతో ఏకీభవించినట్టు. పోన్లే. ఓ అందగత్తె జీవితం మళ్లీ చిగుర్చింది అనుకుని సంతోషించాడు కానీ ఆ ఆనందం ఏడాది పాటే అని అప్పటికి తెలియదతనికి.

మళ్లీ గీతాంజలిని కలవడం చావు సందర్భంలోనే. ఈసారి ఆమె భర్త చావే! స్విమ్మింగ్‌పూల్‌లో ఏక్సిడెంటల్‌గా నంజుండప్ప మరణించడం, ఆ ఇన్వెస్టిగేషన్ సందర్భంగా రవితేజ ఆమె ఇంటికి వెళ్లడం సంభవించింది. అప్పుడు చెప్పిందామె నంజుండప్ప వంటి ముసలివాణ్ణి ఏ పరిస్థితుల్లో పెళ్లి చేసుకోవలసి వచ్చినదీ. రవితేజ నుండి తీసుకున్న ఉత్తరం ఆధారంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ హోదాలో నంజుండప్ప ఆమెను బ్లాక్‌మెయిల్ చేసాడట. తనను పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకోకపోతే కోర్టు కెక్కించి అల్లరి పెడతానన్నాడట. గత్యంతరం లేక గీతాంజలి అతన్ని పెళ్లాడవలసి వచ్చిందిట.

పెళ్లి అయిన తర్వాత మాత్రం బాగానే చూసుకున్నాడట. ఆమెకు తగినవాడినవిపించుకోవాలనే తాపత్రయంతో కుర్రవేషాలు చాలా వేసాడట. వాటిల్లో ఒకటే వద్దంటూంటే స్విమ్మింగ్‌పూల్‌లో దిగడం. ఈత రాకపోయినా వడుచుపెళ్లాన్ని ఇంప్రెస్ చేద్దామని కొలనులో దిగడం, కాళ్లూ చేతులూ ఆడక మునిగి చావడం జరిగింది. అతి కష్టం మీద గీతాంజలి అతన్ని ఒడ్డుకు చేర్చి ఫస్ట్ ఎయిడ్ చేసింది కానీ మాట దక్కలేదు. ఇవన్నీ ఆమె చెప్పినదే నోట్ చేసుకోవలసి వచ్చింది.

*మిగతా 68వ పేజీలో....*

## రాణినెవరూ గుర్తుపట్టడం లేదట!

**బా**లీవుడ్‌లో నంబర్ వన్‌గా వెలుగుతున్న రాణీముఖర్జీకి హైదరాబాదు నచ్చిందట. ఇక్కడ షూటింగులు సకాలంలో ముగిసిపోవటమే కాక, సహనటులు బాగా కలివిడిగా వుంటారట. కనుక హైదరాబాదులో షూటింగ్ అంటే ప్రశాంతంగా వుంటుందంటూంది రాణి. దక్షిణాది నిర్మాతల దృష్టిలో పడిన రాణి, శంకర్ దర్శకత్వంలో నటించటానికి హైదరాబాదుకు వచ్చింది. ఇకముందు కూడా ఇక్కడి షూటింగులకే ప్రాధాన్యమిస్తానని చెబుతూంది. పైగా ఇక్కడ షాపింగ్ చేయటం బాగుందట రాణికి. "ముంబయిలోనైతే అందరూ గుర్తుపట్టి ఇబ్బంది పెడతారు. ఇక్కడ ఆబిడ్స్ లాంటి బిజీసెంటర్‌లో కూడా నన్నెవరూ గుర్తు పట్టకపోవటం నాకు చాలా ఆనందంగా వుంది" అంటూంది రాణి. ఇంతకూ ఇంతగా ఫాలోయింగ్ వున్న రాణిని మన హైదరాబాదులో గుర్తుపట్టేవారే లేకపోయారా ఏమిటి చెప్మా?

ఎస్.



....65వ పేజీ తరువాయి

ఎందుకంటే ఈ సంఘటనకు ప్రత్యక్షసాక్షులెవరూ లేరు కాబట్టి. నంజుండప్ప ఆస్తిలో చాలాభాగం గీతాంజలికే పోతోంది కాబట్టి ఆమె మీదనే అనుమానం రావడం, నివృత్తి చేసుకోవడానికి అనేక ప్రశ్నలు వేయడం జరిగింది. ఏమడిగినా, ఎలా అడిగినా ఆమె తొణకలేదు, బెణకలేదు. చివరకి కేసు మూసివేయవలసి వచ్చింది.

రిటైరయిన తర్వాత రవితేజ తన స్వంత ఊరికి వచ్చి సెటిలై పోయాడు. అంత చిన్న ఊరిలో గీతాంజలిని మళ్లీ చూడవలసి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. అదీ మూడోభర్తతో కలిసి తిరుగుతూ. ఆమె చూడనట్టు నటించింది. గతచరిత్ర తెలిసిన వారెవరితోనైనా అలాగే ప్రవర్తించడం సహజం.

ఆమె మూడవ భర్త గురించి వాకబు చేయగా తెలిసిన విషయాలేమిటంటే అతని పేరు సర్వోత్తమరావు. పక్కనే ఉన్న పెద్ద టౌనులో ఉన్న కాలేజీలో లెక్చరర్. గీతాంజలి ఊరువాడేట. ఇప్పుడు గడించాడు కానీ అప్పట్లో పెద్ద డబ్బున్నవాడు కాడుట. చిన్నప్పటి గీతాంజలి తెలుసేమో కానీ బెంగుళూరులో ఆమె ఏమేం చేసిందో తెలిసేందుకు అవకాశం లేదు. తన గతం గురించి గీతాంజలి చెప్పిందో లేదో తెలియదు. ప్రస్తుతానికి మాత్రం ఇద్దరూ సంతోషంగా ఉన్నట్టు కనబడుతున్నారు. సర్వోత్తమరావుకి మొదటి భార్య మరణం ద్వారా కలిసివచ్చిన పాత ఇల్లు ఆక్రమించి, నివాసయోగ్యంగా చేసే ప్రయత్నంలోనే భార్యాభర్తలిద్దరూ ఈ ఊరు వచ్చారని తెలిసింది.

సర్వోత్తమరావుని తలుచుకుంటే రవితేజకు జాలి వేసింది. ఆకాశానికి గీతాంజలి వేసుకుంటున్న నిచ్చెనలో ఇతనొక మెట్టేమోనని అనుమానం వచ్చింది. గీతాంజలి మాజీ భర్తలందరి లాగానే సర్వోత్తమరావుకి ఇప్పుడు డబ్బు ఉంది. అతను పోతే ఆస్తి కలిసివచ్చేది గీతాంజలికే అతనికి వేరే పిల్లలు లేరు కాబట్టి. మరి అతన్ని కడతేర్చి ఆస్తి పెంచుకోవడానికి గీతాంజలికి అడ్డేముంది? పాత భర్తలను ఆమెయే కడతేర్చిందా? లేక అవి ఏక్సిడెంట్లేనా?

ఆలోచించిన కొద్దీ రవితేజకు అనుమానాలు పెరిగాయి. ఫణీంద్రది హత్యో, ఆత్మహత్యో ఖచ్చితంగా తెలియకపోయినా, అది ఆత్మహత్య అని తను నిర్ధారించడానికి కారణం ఆ ఉత్తరం.

కానీ ఆ ఉత్తరం ఫణీంద్ర రాసినదే అని ఎలా చెప్పగలం? హేండ్‌రైటింగ్ చెక్ చేయించలేదు. గీతాంజలే భర్త పేర ఆ ఉత్తరం రాసిందేమో! ఆ ఉత్తరంలో దోషిగా నిలబడినది గీతాంజలి కాబట్టి, ఆమె పై అనుమానం పోలేదప్పుడు. కానీ ఆ నేరం అతి చిన్నది...గయ్యాళితనం. హంతకురాలిగా బోనులో నిలబడే బదులు గయ్యాళిగా పేరు బడడం మేలు కదా! అందుకే ఆమె ఆ ఉత్తరం సృష్టించి ఉండవచ్చు. ఆమె ముఖం చూసి తను మోసపోయి వుండవచ్చు.

అలాగే నంజుండప్ప కేసూ. అతను స్విమ్మింగ్‌పూల్ చావుకి సాక్షులు లేరు. ఈమెయే రెచ్చగొట్టి అతన్ని ఈతకొట్టడానికి ప్రేరేపించిందేమో! పడుచుపెళ్లాం సరదా తీర్చడానికి ఈత రాకపోయినా కొలనులో దిగేడేమో! అంతగా అవసరం పడితే సహాయం చేస్తానని నమ్మించి నీటిలో దింపి, అసలైన టైములో తప్పుకుందేమో! అసలు నంజుండప్ప గీతాంజలికి ప్రపోజ్ చేశాడో, లేక గీతాంజలే అతనికి వల విసిరిందో! ఇదంతా ముందే వేసుకున్న ప్లానా?

కావచ్చు, కాకపోవచ్చు. ఏక్సిడెంట్ అనేది యాదృచ్ఛికంగా జరుగుతుంది కానీ మళ్లీ, మళ్లీ అలాగే జరుగుతూంటే దాని వెనక్కాల ఏదో కుట్ర ఉందని అనుమానించవలసినదే! అందునా ప్రతీసారీ లాభపడుతున్నది గీతాంజలే అవుతున్నప్పుడు! ఇప్పుడు ఆమె వలలోకి చిక్కిన పక్షి సర్వోత్తమరావు. ఇతని చావుకి ఎప్పుడు ముహూర్తమో తెలియదు. ఇది కూడా తెలివిగా, మరో ఏక్సిడెంటులా చూపించగలిగిందంటే ఈ హత్య నుండి కూడా బయటపడగలదు. ఈ కేసు ఒక్కటి మాత్రం ఇన్వెస్టిగేట్ చేసిన పోలీసు అధికారి ఇదో యాక్సిడెంట్‌గా తీర్మానించడం ఖాయం. ఆమె అమాయకపు ముఖం ఇంకే కారణాన్ని తోచనివ్వదు. కానీ ఆమె దురదృష్టవశాత్తూ ఆమె గతం తెలిసిన తను ఉన్నాడు ఇక్కడ.

ఆ విషయం ఆమెకు గుర్తు చేసి 'ఖబడ్దార్, జరిగినదేదో జరిగిపోయింది. ఇకపై ఎటువంటి ప్రయత్నాలు చేయకు.' అని హెచ్చరిస్తే మంచిదనిపించింది రవితేజకు.

'సర్వోత్తమరావుతోనైనా సరిగ్గా కాపురం చేసుకో, లేదా పాతవన్నీ బయటకు లాగి జైలుకి పంపాల్సి ఉంటుంది జాగ్రత్త' అని చెప్పేస్తే ఒక నిండు ప్రాణాన్ని కాపాడినట్టుంటుంది అనుకున్నాడు. వాళ్ల ఇంటి దగ్గర ఒకటి, రెండు సార్లు తచ్చాడినా గీతాంజలి అతన్ని చూసినా గుర్తుపట్టనట్లు ప్రవర్తించలేదు. 'అంటే తనను మర్చిపోయి వుండాలి, లేదా నటిస్తూ ఉండాలి. మర్చిపోయినా ప్రమాదమే. తను ఇక్కడున్నాడని తెలియక ఇంకో సాహసానికి ఒడిగట్టవచ్చు. నటిస్తూ ఉన్నా ప్రమాదమే! గుండెలు తీసిన బంటు కాబోలు'.

గీతాంజలి ఇంటికి వెళ్లి హెచ్చరించడానికి అనువైన సమయం కోసం ఎదురుచూస్తున్న రవితేజకు హఠాత్తుగా ఓ పాతకథ గుర్తుకువచ్చింది. అందులో ఇంచుమించు ఇలాటి కేసే! కథ చివర్లో



## సౌందర్య స్థాయికి ఎదుగుతా!

అంటూందట కొత్తగా వచ్చిన హీరోయిన్ రిచా. నేడు పెద్ద, చిన్న హీరోలతో నటించేస్తున్న నంబర్ వన్ హీరోయిన్ సౌందర్యే! ఆమెతో పోటీవచ్చే నటి ఎవరూ లేరని అనుకుంటుంటారు. సిమ్రాన్ కూడా "సౌందర్య సీనియర్ నటి. ఆమెతో నాకేమీ పోటీ లేదు" అంటూంటుంది. ఇటీవల విడుదలైన 'నువ్వే కావాలి' హీరోయిన్ రిచా ఇప్పుడు ఒక చిత్రంలో సౌందర్యతో కలిసి పనిచేస్తోంది. సాధారణంగా కొత్త నటీమణులు పెద్దతారలతో కలిసిచేయటానికి భయపడతారు. కానీ రిచా అందుకు భిన్నంగా ఆ పాత్రను ఛాలెంజింగ్‌గా తీసుకుందట. ఆ చిత్రకథానాయకుణ్ని ప్రేమించే హీరోయిన్లు సౌందర్య, రిచా-ఇద్దరూనట. బాలీవుడ్‌లో నటించాలనుకుందట కానీ, తెలుగు నిర్మాతలు ముందు ఇంట గెలిచాక రచ్చ గెలవమని సలహా ఇచ్చారట. ఒక్క సినిమాకే ఆకాశం అందుకోవాలంటే కుదరదని తెలుసుకుని ప్రవర్తించడం మంచిదంటే, అప్పుడు ఈ చిత్రానికి ఓకే అందట రిచా. బాగుంది సంబరం!

ఎస్.

పోలీస్ ఇన్స్పెక్టర్ వెళ్లి నీ భర్తకు నీ గతం చెప్తానని ఆమెను హెచ్చరించబోతే 'సారీ, ఇక అటువంటిది ఏమీ చేయను. మనం ఫ్రెండ్స్‌గా ఉందాం.' అని చెప్పి నమ్మించి కాఫీలో విషం కలిపి ఇచ్చేస్తుంది. విషం తలకెక్కి ఇన్‌స్పెక్టర్ చావబోతూంటే అంటుంది 'నా భర్తకు నాకు విరోధం పెడతావా?' అని. భర్తను పిలుస్తుంది 'ఇన్‌స్పెక్టర్ ఏక్సిడెంటల్‌గా చచ్చిపోయాడు. పాపం! చూడండి.' చివరి ఏక్సిడెంట్ ఇన్స్పెక్టర్ కన్నమాట.

కథలో ఎలా కావాలంటే అలా రాయవచ్చులే అనుకుంటూనే రవితేజకు సడన్‌గా భయం వేసింది. ఒకవేళ తన కేసులోనూ అలాగే జరుగుతుందేమోనని. మెదలకుండా ఊరుకుంటే పోలేదా అనిపించింది. ఆ తర్వాత ఇంకో అనుమానం వచ్చింది. గీతాంజలి తనను గుర్తుపట్టి ప్లానుకి అడ్డువస్తానన్న భయంతో ముందు తననే చంపితే!? ఇంటికి పిలిచి కాఫీయే ఇవ్వనక్కరలేదు. గూండాలచేత కొట్టించి చంపవచ్చు.

వారం రోజులు ఆలోచించిన మీదట తనే చొరవ తీసుకుని ఈ గొడవకు పరిష్కారం వెతికితే మంచిదనిపించింది రవితేజకు. గీతాంజలి గుణగణాలు ఎటువంటివైనా, ఆమె మాజీభర్తల చావు గురించి సర్వోత్తమరావుకి చెపితే మంచిదనిపించింది. ఆ తర్వాత అతను తీసుకోవలసిన జాగ్రత్తలు అతను తీసుకుంటాడు. కనీసం గీతాంజలి ఇకపై హత్యా ప్రయత్నాలు చేయదు.



ఆ రోజు సాయంత్రమే రోడ్డు మీద కలిసిన సర్వోత్తమరావును పరిచయం చేసుకున్నాడు రవితేజ. "మీతో కాస్త పర్సనల్‌గా మాట్లాడాలి రేపు ఎడకల్లు గుట్టమీదకి రండి. ఓ గంటసేపు కూచుందాం" అన్నాడు.

"ఎడకల్లు గుట్టా? ఊరిబయట ఉన్నది. అంత నిర్మానుష్యమైన చోటుకెందుకు?" అని అడిగేడు సర్వోత్తమరావు.

"భయం లేదు లెండి. నేను రోజూ ఈవెనింగ్ వాక్‌కి అక్కడికే వెళుతూంటాను. ఈ మధ్య సుగర్ ఎక్కువ కావడంతో వాకింగ్ పెంచమన్నాడు డాక్టర్. మీరూ రండి. చీకటి పడేలోపున తిరిగివచ్చేద్దాం." అన్నాడు రవితేజ చిరునవ్వు నవ్వుతూ.

"మీరు సాయంత్రం ఐదుగంటలకు రమ్మంటున్నారు. అదీ వంటరిగా. మా ఆవిడ ఊరుకోదు. మహా అనుమానం మనిషి. కొండలూ, గుట్టలూ పట్టుకు తిరుగుతున్నానంటే ఎవత్తిని కలవడానికో అనుకుంటుంది." అన్నాడు సర్వోత్తమరావు సగం సీరియస్‌గా, సగం జోవియల్‌గా.

"నేను ఇద్దరు, ముగ్గురికి చెప్పి ఉంచుతాను. ఆ సమయంలో తమతో బాటు క్లబ్బులో పేకాడుతున్నారని ఎలిబయ్ ఇస్తారు. పోలీసులు వచ్చి అడిగినా సరే, మాట తప్పరు. సరేనా? ఇది ముఖ్యమైన విషయం కాబట్టి, మీ ఒక్కరికే చెప్పాలి కాబట్టి రమ్మన్నాను. ఇలా రోడ్డు మీద, హోటల్‌లో చెప్పే విషయం కాదు. కాస్త ప్రశాంతంగా వినాలి మీరు." అన్నాడు రవితేజ అనునయంగా.

మరునాడు సాయంత్రం రవితేజ తనకు తెలిసున్నదంతా చెప్పేటప్పటికి చీకటి కారణంగానేమో, సర్వోత్తమరావు ముఖం మీద కదలాడే భావాలు ఏమీ తెలియరాలేదు. మౌనంగా విన్నాడు అన్నీ. చివరకి, "అలా నడుద్దామా?" అన్నాడు.

"రండి, బుర్ర వేడెక్కినప్పుడు, మనస్సు బరువెక్కినప్పుడు వాకింగే బెటర్." అన్నాడు రవితేజ లేస్తూ.

ఇద్దరూ ఏమీ మాట్లాడకుండా నడుస్తూ కొండ అంచు దాకా వచ్చారు. అప్పుడు నోరు విప్పాడు సర్వోత్తమరావు-"రవితేజ గారూ! మీకు చాలా విషయాలు తెలుసు. కానీ కొన్ని విషయాలు మాత్రం తెలియవు. నేనూ, గీతాంజలి చిన్నప్పటినుండీ ప్రేమించుకున్నాం. కానీ నాకు ఆమె దక్కకపోవడానికి కారణం నాకు డబ్బు లేకపోవడం. అప్పుడే నిశ్చయించుకున్నాం ఎలాగైనా డబ్బు సంపాదించి ఒకటవాలని. ఎవరికి అవకాశం ఉంటే వాళ్లు, ఎలా పడితే అలా బోల్డంత డబ్బు సంపాదించి ఇద్దరం కలిసి సుఖంగా అనుభవిద్దామని నిర్ణయించుకున్నాం. ఆ పథకంలో భాగంగానే నేను నా భార్యను చంపడం జరిగింది. గీతాంజలి తన మొగుళ్లను చంపడం జరిగింది. ఈ ప్లానులన్నిటికీ కర్తను నేనే!"

రవితేజ నోరు వెళ్లబెట్టాడు, "మై గుడ్‌నెస్! అంటే..." అన్నాడు.

"...అందుచేత మా ప్లానుకి చివరి అవరోధం మీరే! మిమ్మల్ని గీతాంజలి గుర్తుపట్టింది. అయినా మీకు తగిలే అనేక కేసుల్లో తన కేసు గుర్తుండదని, తన ముఖం జ్ఞాపకం ఉండదనీ అనుకుని ఊరుకుంది. నాకు అన్నీ చెప్పింది. కానీ మీరు నిన్న నాతో మాట్లాడడంతో తెలిసింది మీ పోలీసు బుర్ర ప్రమాదకరమైనదని. మీ చావు మీరు కొని తెచ్చుకున్నారు."

రవితేజ ఖంగారు పడ్డాడు. "వాట్డూయూ మీన్?" అంటూ.

సర్వోత్తమరావు ఖంగారు పడలేదు. "సింపుల్. మిమ్మల్ని ఇక్కణ్నుంచి తోసేయబోతున్నాను. సుగర్ వల్ల కళ్లు తిరిగి, ఈవెనింగ్ వాక్‌కి వచ్చినప్పుడు జారిపడ్డారనుకుంటారు. పోనీ హత్య అనుకున్నా నా మీదకు అనుమానం రాదు. నాకు మోటివ్ ఏమిటో ఎవడూ ఊహించలేడు కాబట్టి. మనిద్దరం విడివిడిగా ఇక్కడికి చేరాం. నన్ను మరీ అడిగితే మీరు ఏర్పాటు చేసిన ఎలిబయ్ ఎలాగూ ఉంది. అదీ కాక, పోలీసు వాళ్లు కదా, మీరు జైలుకి పంపిన వాళ్లెవరో కనిపెట్టుకుని చంపి ఉంటారనుకుని ఆ రికార్డులన్నీ తిరగేస్తారు కానీ, అనుమానించి వదిలేసిన గీతాంజలిపైకి ఎవరి దృష్టీ పోదు."

సర్వోత్తమరావు ఆర్గ్యుమెంటు రవితేజకు అర్థమయ్యేలోపునే అతనికి చావు ముంచుకొచ్చింది. ●

## ఒక హెడ్‌లైన్‌తో తీశాట్ట!

దర్శకుడు శంకర్ 'ఒకే ఒక్కడు' ద్వారా సంచలనం సృష్టించి పేరు తెచ్చుకున్నవాడు. అంతకుముందు తీసిన ఐదుచిత్రాలూ ఆయనకు మంచిపేరే తెచ్చాయి. 'ఒకే ఒక్కడు' చిత్రకథను తాను ఒక్క హెడ్‌లైన్‌తో తీయగలిగానని చెప్పారాయన. ఎలాగంటే, న్యూస్‌పేపర్లు తిరగేస్తుంటే, ఒక సామాన్యపౌరుడు ఓ రోజు ముఖ్యమంత్రి అయితే ఏం చేయగలడు?-అనేది ఆలోచనలోకి వచ్చి అది ఆ చిత్రంగా రూపుదిద్దుకుందట. (ఇది మనకు 'ఒక రోజు రాజు' అనేపేరుతో పాత చందమామ కథలాగుంది కదూ?) మరందుకనే తనను పలకరించటానికి వచ్చినవారిని సరదాగా "ఏదైనా థీమ్ చెప్పండి" అని అడుగుతుంటారట. మరి జనం తమ అదృష్టాన్ని పరీక్షించుకోవలసివుంది.

ఎస్.